ప్రజా సంక్షేమమే లక్ష్యం


నందకిషోర్ వ్యాస్‌ను సత్కరించిన నేతలు

అబిడ్స్: ప్రజా సేవకే జీవితం అంకితమని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు, గోషామహల్ నియోజకవర్గానికి చెందిన సీనియర్ నేత నందకిషోర్ వ్యాస్ పేర్కొన్నారు. నిరంతరం కాంగ్రెస్ ప్రభుత్వ పథకాలను గోషామహల్ నియోజకవర్గ ప్రజలకు అందిస్తూ వారి సంక్షేమానికి కృషి చేస్తున్నానని తెలిపారు. బుధవారం నందకిషోర్ వ్యాస్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గానికి చెందిన పలు పార్టీల నాయకులు పప్పు మాత్రే, ఆనంద్ సింగ్, మనోహర్ గైక్వాడ్, పూజవ్యాస్, నాగరాజు, రాములతో పాటు పలువురు నాయకులు ఆయనను ఘనంగా సత్కరించారు. అనంతరం నందకిషోర్ వ్యాస్ మాట్లాడుతూ... మూడు దశాబ్దాలుగా సమాజ సేవలో ఉన్న తాను జీవితాంతం ప్రజల సంక్షేమానికి, ప్రజల అభ్యున్నతికి నిరంతరం పాటుపడుతున్నానన్నారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం సంక్షేమ పథకాలు నియోజకవర్గంలో అందరికీ అందించేందుకు కృషి చేస్తొన్నారు.

పురస్కారం అందజేత

దిల్‌సుఖ్‌నగర్: చిక్కడపల్లిలోని త్యాగరాయ గానసభలో నిర్వహించిన యువ ఆర్ట్ థియేటర్ 21 వ వార్షికోత్సవంలో రెండు తెలుగు రాష్ట్రాల్లో విద్యా, వైద్య, తదితర రంగాల్లో విశేష సేవలు అందిస్తున్న ప్రముఖులకు అవార్డులతో సన్మానించారు. ఆర్‌కే పురం చిత్రలేవుట్ కాలనీలోని అనాథ విద్యార్థి గృహ అధ్యక్షుడు మార్గం రాజేష్‌కు సేవా భూషణ్ పురస్కారాన్ని కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ సముద్రాల వేణుగోపాలచారి అందజేశారు. యువ ఆర్ట్ థియేటర్ అధ్యక్షులు డా.బి.ఆర్.వెంకట రమణ మాట్లాడుతూ.. అనాథ విద్యార్థి గృహ అధ్యక్షుడు మార్గం రాజేష్ ప్రైవేట్ రంగంలో అద్భుత విద్యావకాశాలు కల్పించాలన్నారు.

కుటుంబ సర్వేకు సహకరించాలి

చార్మినార్ జోనల్ కమిషనర్ వెంకన్న

- పాతబస్తీలో అట్టహాసంగా సర్వే ప్రారంభం
- చార్మినార్, బహదూర్‌పురా ఎమ్మెల్యేల సమాచారం సేకరించిన జెడ్‌సీ


చార్మినార్‌లో సర్వే నమోదు పత్రాన్ని ఎమ్మెల్యే మీర్‌జుల్ఫీకర్ అలీకి అందజేస్తున్న దృశ్యం

చార్మినార్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేకు ప్రజలందరూ పూర్తిగా సహకరించాలని జీహెచ్‌ఎంసీ చార్మినార్ జోనల్ కమిషనర్ టి.వెంకన్న సూచించారు. సమగ్ర కుటుంబ సర్వే ప్రారంభోత్సవం సందర్భంగా బుధవారం జోన్ పరిధిలో కొనసాగుతున్న సర్వేను ఆయన స్థానిక డిప్యూటీ కమిషనర్లతో కలిసి పరిశీలించారు. ఫలక్‌నుమా సర్కిల్ పరిధిలోని జహనుమా ప్రాంతంలో నివాసముండే బహదూపుర్ ఎమ్మెల్యే మహమ్మద్ ముబీన్‌ను అయన నివాసంలో కలసి సర్వే ప్రక్రియను వివరించి ఆయన ఇంటికి స్టిక్కర్ వేయించారు. అనంతరం హుస్సేనీ ఆలంలోని చార్మినార్ ఎమ్మెల్యే మీర్‌జూల్ఫీకర్ అలీ ఇంటికి వెళ్లి సర్వేపై ఆయనతో చర్చించి అనంతరం వారి ఇంటికి సర్వేకి స్టిక్కర్‌ను అతికించారు. ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ వెంకన్న మాట్లాడుతూ... సర్వే నేపథ్యంలో బ్లాక్‌కు ఒక సూపర్‌వైజర్‌ని నియమించి ఎలాంటి సమస్యలు తలెత్తకుండా పటిష్ట చర్యలు తీసుకున్నామన్నారు. ఇప్పటికే పలు ప్రాంతాల్లో ఇళ్లను గుర్తించి స్టిక్కర్లు వేయించమన్నారు. క్షేత్రస్థాయిలో నిర్వహిస్తున్న ఇంటింటి సర్వేలో సేకరించిన కుటుంబ వివరాలను సర్వే ఫార్మాట్‌కు అనుగుణంగా డిప్యూటీ కమిషనర్ల పర్యవేక్షణలో డేటా ఎంట్రీలో పొందుపరచనున్నామన్నారు. మూడు వారాల పాటు నిర్వహించే సమగ్ర కుటుంబ సర్వేకు ఇంటి వద్దకు వచ్చే సిబ్బందికి ప్రజలందరూ పూర్తి సహకారం అందించి తమ కుటుంబ వివరాలను అందించాలని కోరారు. చాంద్రాయణగుట్ట, చార్మినార్, ఫలక్‌నుమా సర్కిళ్ల డిప్యూటీ కమిషనర్లు సురేందర్, సరిత, అరుణకుమారి, ప్రత్యేక సిబ్బంది పాల్గొన్నారు.

కార్వాన్ నియోజకవర్గం పరిధిలో...

గోల్కొండ: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కుటుంబ సర్వే కార్యక్రమం కార్వాన్ నియోజకవర్గంలో ప్రారంభమైంది. ఉదయం నుంచే బల్దియా డిప్యూటీ కమిషనర్ శశిరేఖ పర్యవేక్షణలో కార్యక్రమం కొనసాగింది. నియోజకవర్గంలోని అన్ని డివిజన్‌లలో సర్వే సిబ్బంది ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా శశిరేఖ మాట్లాడుతూ... సర్వేలో పాల్గొంటున్న సిబ్బందికి సమగ్ర శిక్షణ ఇచ్చారన్నారు. వ్యక్తిగత, సామాజిక, ఆర్థిక వివరాల సేకరణ కోసం ప్రతి సిబ్బందికి అవగాహన కల్పించి అన్ని వివరాలను తెలిజేశారన్నారు. సమగ్ర కుటుంబ సర్వే విజయవంతంగా నిర్వహించాలన్నదే తమ లక్ష్యమని ఇందు కోసం సిబ్బందితో కలిసి పర్యటిస్తు సర్వేను పరిశీలిస్తున్నామన్నారు. సర్వేలో మొత్తం 642 మంది వలంటీర్లు పాల్గొంటున్నారని ఆమె వివరించారు. మొదటి రోజు 9520 ఇళ్లకు తిరిగి సర్వేను నిర్వహించామని ఈ సందర్భంగా ఆమె వెల్లడించారు.

గౌలిపురా డివిజన్‌లో...

గౌలిపురా: గౌలిపురా డివిజన్‌లోని చాపలగల్లీ జీహెచ్‌ఎంసీ వార్డు కార్యాలయం వద్ద బుధవారం బీసీ కుల గణన ఇంటింటి సర్వే కార్యక్రమాన్ని గౌలిపురా డివిజన్ కార్పొరేటర్ ఆలే భాగ్యలక్ష్మీ ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ... ప్రభుత్వం శిక్షణ సమయంలో ఇచ్చిన గైడ్‌లైన్స్ ప్రకారం ఎన్యూమరేటర్లందరూ ఇంటింటి సర్వేను చేపట్టాలన్నారు. ఎవైనా సందేహాలుంటే క్లస్టర్ ఇన్‌చార్జిలతో సందేహాలు నివృత్తి చేసుకొని సరైన వివరాలను పొందుపరచాలన్నారు. ఇంటి వద్దకు వచ్చే ఎన్యూమరేటర్లకు ప్రజలందరూ పూర్తిగా సహయ సహకారాలు అందించాలన్నారు. ఏఎంసీ సురేందర్ గౌడ్, ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్ రామేశ్వర్, బిల్లు కలెక్టర్ జగదీశ్వర్, ఎంటమాలజీ ఏఈ భారతి, గౌలిపురా ఏఈ తేజోవంతు, బీజేపీ నాయకులు ఇ.సుమన్ కుమార్ ముదిరాజ్, జి.రఘుకాంత్, కొడి సురేందర్, జమాల్‌పూర్ అశోక్, కె.అర్జున్ ఆర్య, సి.హెచ్.సాయి కిశోర్, జి.వికాస్ తదితరులు పాల్గొన్నారు.

విజయవంతం చేయాలి

కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్


సర్వేను పరిశీలిస్తున్న కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కుటుంబ సర్వేను విజయవంతంగా నిర్వహించాలని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్ అన్నారు. బుధవారం ఆయన కార్వాన్ నియోజకవర్గంలోని పలు డివిజన్‌లలో పర్యటించి సర్వే జరుగుతున్న తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... సర్వే చేసిన ఇంటిని గుర్తించడం ఎలా అనే అనుమానం రాకుండా సర్వే చేసిన ఇంటిని ప్రత్యేకంగా గుర్తించాలన్నారు. ప్రజలు కూడా తమ కుటుంబ వివరాలను వివరంగా సర్వే కోసం వచ్చిన సిబ్బందికి తెలపాలన్నారు. కుటుంబంలోని ప్రతి సభ్యుడి వివరాలను నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు. సర్వే చేసిన ఇంటికి సర్వే అయినట్లు స్టికర్ అంటిస్తున్నామని బల్దియా డిప్యూటీ కమిషనర్ శశిరేఖ ఎమ్మెల్యేకు వివరించారు. వార్డు ఇన్‌చార్జీలు హిమబిందు, కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, బల్దియా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

గోల్కొండ: విద్యుత్ సంబంధ మరమ్మతు పనుల కారణంగా గురువారం ప్రలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు అధికారులు తెలిపారు. లంగర్‌హౌస్ సబ్‌స్టేషన్ ప్రశాంత్‌నగర్ 11 కేవీ ఫీడర్ పరిధిలోని ఎన్‌ఆర్‌ఐ కాలనీ, కేజీఎన్ హోటల్, ప్రశాంత్‌నగర్, బాపూఘాట్, అంబేడ్కర్‌నగర్, లక్ష్మీనగర్, ఇంద్రానగర్, ఫ్లోర్ మిల్ ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదు. అదే విధంగా ఫతేదర్వాజ 11 కేవీ ఫీడర్ పరిధిలోని ఫతేదర్వాజ, చోటా బజార్, సెంట్రల్ బంగ్లా, న్యూ జీఎం, పోస్ట్ ఆఫీస్, సాత్ గల్లీ, బడాబజార్, దాన్ కోట, సాలేనగర్ కంచె తదితర ప్రాంతాల్లో మధ్యాహ్నం 12 నుంచి 2 గంటల వరకు, మోతీమహల్ సబ్‌స్టేషన్ కంపెనీ బాగ్ 11 కేవీ ఫీడర్ పరిధిలోని మోతీదర్వాజా, షాంగ్రిల్లా, కంపెనీబాగ్, అహ్మద్ కాలనీ, బగ్దాత్ కాలనీ తదితర ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదు.

మెహిదీపట్నం విద్యుత్ డివిజన్ పరిధిలో...

లంగర్‌హౌస్: మెహిదీపట్నం విద్యుత్ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో గురువారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏడీఈ తెలిపారు.

11కేవీ ప్రశాంత్‌నగర్, ఫతేదర్వాజ ఫీడర్లలో...

ఎన్‌ఆర్‌ఐ కాలనీ, కేజీఎన్ హోటల్, ప్రశాంత్‌నగర్, బాపుఘాట్, పెన్షన్‌పుర, లంగర్‌హౌస్ మార్కెట్, అంబేడ్కర్ నగర్, లక్ష్మీనగర్, మిలిటరీ ఆస్పత్రి, ఇందిరా నగర్, ఫ్లోర్ మిల్, ఫతేదర్వాజ, చోటాబజార్, సెంట్రల్ బంగ్లా, మ్యూజియం, పోస్ట్ ఆఫీస్, సెవెన్త్ గల్లి, బడాబజార్, ధాన్‌కోట, సాలెనగర్ కంచ ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదు.

11కేవీ కంపెనీబాగ్ ఫీడర్ పరిధిలో...

మోతిదార్వజ, షంగ్రీల పాఠశాల, అప్సర్ కాలనీ, కంపెనీబాగ్, అహ్మద్ కాలనీ, బాగ్దాద్ కాలనీ ప్రాంతాల్లో మద్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నామని అధికారులు వెల్లడించారు.

హెడ్ కానిస్టేబుల్ అమర్‌నాథ్ మృతి

సంతోష్‌నగర్: కంచన్‌బాగ్ పోలీస్‌స్టేషన్‌లో పని చేస్తున్న హెడ్ కానిస్టేబుల్ ఎ.అమర్‌నాథ్ బుధవారం మరణించారు. కిడ్నీ సంబంధ వ్యాధితో బాధపడుతున్న ఆయన ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. వివరాలివీ... గుర్రంగూడ ఎస్.వి.కాలనీ ప్రాంతానికి చెందిన ఎ.అమర్‌నాథ్ (55) కంచన్‌బాగ్ పోలీస్‌స్టేషన్‌లో 2019 అక్టోబర్ 25వ తేదీ నుంచి హెడ్ కానిస్టేబుల్‌గా పని చేస్తున్నాడు. కిడ్నీ సంబంధ వ్యాధి కారణంగా ఆయన డయాలసిస్ చేయించుకుంటున్నారు. ఈ క్రమంలో ఎల్‌బీనగర్‌లోని పునరావాస కేంద్రంలో చికిత్స నిమిత్తం చేరారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అమర్‌నాథ్ మృతి చెందాడు. దీంతో హైదరాబాద్ సిటీ పోలీస్ తరఫున అమర్‌నాథ్ అంత్యక్రియల కోసం రూ. 20 వేలను అందజేయడంతో కంచన్‌బాగ్ ఎస్‌ఐలు లింగరాజు, పద్మయ్యలు వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ విషయం తెలుసుకున్న సిటీ పోలీస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు శంకర్‌రెడ్డి, ఇతరులు పాల్గొని ఆయన పార్థివ దేహానికి నివాళులర్పించారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం

హుడాకాంప్లెక్స్: హామీల అమలులో రాష్ట్ర ప్రభుత్వం విఫలమయిందని ఎమ్మెల్యే సబితారెడ్డి ఆరోపించారు. ఎన్నికల సమయంలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్‌లకు రూ.లక్షతో పాటు తులం బంగారం ఇస్తానని చెప్పిన మాటను నిలుపుకోవాలని డిమాండ్ చేశారు. బుధవారం సరూర్‌నగర్ తహసీల్దార్ కార్యాలయంలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడారు. వంద రోజుల్లో ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని చెప్పిన కాంగ్రెస్ పార్టీ.. అధికారం చేపట్టి 11 నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు అమలు చేయడం లేదని విమర్శించారు. బీఆర్‌ఎస్ హయాంలో తెచ్చిన కేసీఆర్ కిట్‌ను అందజేయాలన్నారు. 44 లక్షల మంది రైతులకు రుణమాఫీ చేయాల్సి ఉండగా.. 22 లక్షల మందికి చేసి, అందరికీ చేసినట్లు చెప్పుకుంటున్నారని ఎద్దేవా చేశారు. ప్రజాపాలనలో తీసుకున్న దరఖాస్తుల స్టేటస్ ఇప్పటివరకు చెప్పలేదన్నారు. కులగణనను పారదర్శకంగా చేయించాలని ప్రభుత్వానికి సూచించారు. అనంతరం గత ప్రభుత్వ హయాంలో సరూర్‌నగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో నిర్మించిన నూతన భవనాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ రాధ, తహసీల్దార్ వేణుగోపాల్, డిప్యూటీ తహసీల్దార్ జంగయ్య, బీఆర్‌ఎస్ నాయకులు మురుకుంట్ల అరవింద్‌శర్మ, పెండ్యాల నగేష్, లోకసాని కొండల్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ఎం.ఏ.సాజిద్, రాంనర్సింహగౌడ్, పెంబర్తి శ్రీనివాస్, కంచర్ల శేఖర్, ఋషి, స్వప్నారెడ్డి పాల్గొన్నారు.

ప్రజా సేవకే జీవితం అంకితం

- కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్



గోల్కొండ: మూడు దశాబ్దాలకు పైగా మజ్లిస్ పార్టీలో ఉంటూ ప్రజా సేవ చేస్తున్నానని.. జీవితాంతం ప్రజలకు సేవ చేసేందుకే ప్రాధాన్యమిస్తానని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్ పేర్కొన్నారు. బుధవారం ఆయన జన్మదినం సందర్భంగా మజ్లిస్ నాయకులు హారూన్‌ఫరాన్, అబ్బాస్‌హుస్సేన్‌లు ఆయనను కలిసి పూలమాలలు వేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... పదవులతో సంబంధం లేకుండా జీవితాంతం ప్రజా సేవ చేస్తుంటానని అన్నారు. మజ్లిస్ పార్టీ కార్యకర్తగా, క్రియాశీల కార్యకర్తగా పని చేసి ఎమ్మెల్యే స్థాయికి ఎదిగానన్నారు. ప్రజల దీవెనలతోనే ఈ స్థాయికి రావడం జరిగిందని ప్రజలతో పాటు మజ్లిస్ పార్టీ అధిష్టానానికి రుణపడి ఉంటానని ఆయన అన్నారు.

వాటర్‌బోర్డు సమస్యలను పరిష్కరించండి


జీఎంతో సమావేశమైన బీఆర్‌ఎస్ నాయకుడు ఆనంద్‌కుమార్‌గౌడ్

అబిడ్స్: గోషామహల్ నియోజకవర్గంలోని వాటర్‌బోర్డు పరిధిలో నెలకొన్న సమస్యలను సత్వరమే పరిష్కరించాలని టీఆర్‌ఎస్ పార్టీ నియోజకవర్గ నాయకుడు ఎం.ఆనంద్‌కుమార్ గౌడ్ పేర్కొన్నారు. బుధవారం వాటర్‌బోర్డు జీఎం జాన్ షరీఫ్‌తో ఆయన సమావేశమై పలు సమస్యలు వివరించారు. దారుసలాం, భరత్‌నగర్ పటేల్‌నగర్, ఎస్‌బినగర్ తదితర ప్రాంతాల్లో వాటర్‌బోర్డు సమస్యలను పరిష్కరించాలని కిందిస్థాయి అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పరిష్కరించడం లేదన్నారు. వెంటనే సంబంధిత మేనేజర్లు వాటర్‌బోర్డు సమస్యలను గోషామహల్ నియోజకవర్గంలో పరిష్కరించకుంటే వాటర్‌బోర్డు ఎండీకి ఫిర్యాదు చేస్తామని ఆనంద్‌కుమార్ గౌడ్ వెల్లడించారు. నేతలు కైసర్, మహ్మద్ అహ్మద్, గౌస్, షేక్ జహంగీర్, యూసుఫ్ పటేల్, మహ్మద్ ఫర్దూస్, మహ్మద్ ఇక్బాల్ తదితరులు పాల్గొన్నారు.

సెంట్రల్ లైటింగ్ సిస్టం మాయం

- విచారణ చేపట్టాలని వినతి


కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న బీజేవైఎం అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి

బడంగ్‌పేట్: బడంగ్‌పేట కార్పొరేషన్‌లో ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్ సిస్టం విద్యుత్ స్తంభాలు కనిపించకుండా పోయాయని, ఎలాగైనా వాటి ఆచూకి కనుగొనాలని మున్సిపల్ కమిషనర్ సరస్వతికి బుధవారం బీజేవైఎం కార్పొరేషన్ అధ్యక్షుడు రాళ్లగూడం రామకృష్ణారెడ్డి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గణపతి ఉత్సవాల సందర్భంగా మెయిన్ రోడ్డుపై ఉన్న సెంట్రల్ లైటింగ్ సిస్టం విద్యుత్ స్తంభాలు తీసివేశారని, పండుగ పూర్తయిన వెంటనే తిరిగి ఆయా స్థానాల్లో వాటిని ఏర్పాటు చేయాల్సి ఉన్నప్పటికీ.. ఇప్పటికి వాటి ఊసేలేదన్నారు. సెంట్రల్ లైటింగ్ సిస్టం సంబంధిత కాంట్రాక్టర్ అమ్మేసుకున్నాడని ఆరోపించారు. వీటితో పాటు శివనారాయణపురం కాలనీలో ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్ విద్యుత్ స్తంభాలను కూడా మాయం చేశారన్నారు. వీటిపై సమగ్ర విచారణ జరిపి, దోషులను గుర్తించి చర్యలు తీసుకొని సెంట్రల్ లైటింగ్ సిస్టంను తిరిగి అమర్చాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.

కోటకు పర్యాటక శోభ


గోల్కొండ కోటలో పర్యాటకులు

గోల్కొండ: చారిత్రక కట్టడమైన గోల్కొండ కోట బుధవారం పర్యాటక శోభను సంతరించుకుంది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పర్యాటకులు కోటలో సందడి చేశారు. విజ్ఞాన విహార యాత్రకు వచ్చిన విద్యార్థులు సైతం కోటలో కలియ తిరుగుతూ సందడి చేశారు. విద్యార్థులు ఐదు శతాబ్దాల చరిత్ర గల కోట వివరాలను తమ వెంట ఉన్న ఉపాధ్యాయులను అడిగి తెలుసుకొని అమ్మో అంటూ నోరెళ్లబెట్టారు. మరికొందరు కుతుబ్‌షాహీ రాజుల కాలం నాటి ఆయుధాలను భద్రపరిచిన ఆయుధాగారంలో ఆశ్చర్యంగా తిరుగుతూ ఆనాటి ఆయుధ సంపదను ఆసక్తిగా తిలకించారు. యువ జంటలు కోటలోని ఎత్తైన గోడలు, ఫిరంగుల వద్ద సెల్ఫీలు దిగుతూ సంబరపడ్డారు.

నార్త్ ఇండియన్స్ సంక్షేమానికి కృషి


వేడుకల్లో పాల్గొన్న కుమావత్ తదితరులు

అఫ్జల్‌గంజ్: ఉత్తర భారతీయుల సంక్షేమానికి కృషి చేస్తామని కుమావత్ సమాజ్ రాష్ట్ర అధ్యక్షుడు బాకారం కుమావత్ పేర్కొన్నారు. నగరంలో కుమావత్ సమాజ్‌తో పాటు పలు సమాజ్‌ల లక్షలాది మంది ఉత్తర భారతీయులు నివసిస్తున్నారన్నారు. కుమావత్ సమాజ్ దీపావళి సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు బాకారం కుమావత్ మాట్లాడుతూ..... ప్రభుత్వ సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉత్తర భారతీయులు ఎలాంటి సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకువస్తే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. మంగీలాల్, బాబులాల్, రాజగోపాల్, మహబూబ్, పోలంకి, హనుమాన్ లాల్, శ్యామ్ లాల్, లక్ష్మణ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు క్రీడలపై ఆసక్తి కల్పించాలి


విజేతలతో అర్పిత ప్రకాష్ తదితరులు

గన్‌ఫౌండ్రీ: పాఠశాల స్థాయి నుంచే చిన్నారులకు క్రీడలపై ఆసక్తి కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందని టోటల్లీ కిడ్స్ జిమ్నాస్టిక్స్ అకాడమీ డైరెక్టర్ అర్పిత ప్రకాష్ అన్నారు. మూడు రోజులుగా తెలంగాణ జిమ్నాస్టిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న హైదరాబాద్ డిస్ట్రిక్ట్ ఆర్టిటిస్క్ లెవల్ కాంపిటీషన్ బుధవారం ముగిసింది. ఈ సందర్భంగా వివిధ విభాగాలలో గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులను ప్రదానం చేశారు. ఒక అకాడమీకి చెందిన క్రీడాకారులు 45 పతకాలను సాధించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. కోచ్‌లు క్రాంతికుమార్, గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

చెత్తను తీసి.. మొక్కలు నాటి..!



ఫిలింనగర్: బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయవద్దని జీహెచ్‌ఎంసీ అధికారులు, సిబ్బంది ఎంత మొత్తుకుంటున్నా కొంతమందిలో ఏ మాత్రం మార్పు రావడం లేదు. ఈ నేపథ్యంలో అధికారులు వినూత్న తరహాలో బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయకుండా పలు చర్యలు తీసుకుంటున్నారు. జూబ్లీహిల్స్ డివిజన్ ఫిలింనగర్ దైవ సన్నిధానం ఎదురుగా నిత్యం స్థానికులు, రోడ్డు గుండాపోయే వారు పెద్దఎత్తున చెత్తను విసిరేసి వెళ్తున్నారు. దీంతో వారిలో మార్పు తీసుకురావాలని పారిశుద్ధ్య సిబ్బంది చెత్తను పూర్తిగా తొలగించి మొక్కలు నాటారు. ఈ మొక్కలను చూసైనా వారు ఇక్కడ చెత్తను వేయకుండా ఉంటారని ఆశిస్తున్నారు. అయితే ఇక్కడ మొన్నటి వరకు చెత్తాచెదారం దర్శనమివ్వగా, ఇప్పుడు పరిశుభ్రమైన పచ్చని వాతావరణం కనిపిస్తుంది.

ట్రాఫిక్ నిబంధనలతో ప్రమాదాలకు చెక్

- హెల్మెట్ ధరించిన వాహనదారులకు సన్మానం
- ట్రాఫిక్ నిబంధనలు పాటించకుంటే చర్యలు తథ్యం
- గోషామహల్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ బాలాజీ


హెల్మెట్ ధరించిన వాహనదారులకు సత్కరిస్తున్న ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ బాలాజీ


ద్విచక్ర వాహనాదారులకు కౌన్సిలింగ్ ఇస్తున్న టోలిచౌకీ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సుధాకర్‌రావు

అబిడ్స్: ట్రాఫిక్ నిబంధనలు పాటించని వారికి అవగాహన కల్పిస్తూ ట్రాఫిక్ నిబంధనలను పాటిస్తున్న వారికి పూలమాలలతో గోషామహల్ ట్రాఫిక్ పోలీసులు సత్కరించారు. బుధవారం పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఎంజే మార్కెట్, పురానాపూల్, గోషామహల్, ఎంజే బ్రిడ్జి ప్రాంతాల్లో గోషామహల్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ డి.బాలాజీ ఆధ్వర్యంలో ట్రాఫిక్ పోలీసులు స్పెషల్ డ్రైవ్ కార్యక్రమం చేపట్టారు. హెల్మెట్లు ధరించని వారికి రాంగ్‌రూట్‌లో ప్రయాణించే వారికి ప్రత్యేక అవగాహన కల్పించారు. హెల్మెట్ లేనప్పుడు ప్రమాదం సంభవిస్తే జరిగే పరిస్థితులను వారికి వివరించారు. హెల్మెట్ ప్రాణాపాయం నుంచి కాపాడుతుందని బాలాజీ పలువురు హెల్మెట్ ధరించని వారికి అవగాహన చేపట్టారు. రాంగ్‌రూట్‌లో ప్రయాణించడం ద్వారా తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయని అన్నారు. గోషామహల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో నాలుగు స్పెషల్ టీమ్‌లను ఏర్పాటు చేశామన్నారు. రోజూ పలు ప్రాంతాలు, పలు కీలక చౌరస్తాలలో ఆ ప్రత్యేక టీమ్‌లు ఉండి హెల్మెట్లు ధరించని వారికి, రాంగ్‌రూట్‌లో వెళ్లే వారికి, ట్రాఫిక్ నిబంధనలు పాటించని వారికి, ఓ వైపు అవగాహన కల్పిస్తూ మరోవైపు వారికి చలానాలను విధిస్తామన్నారు. ట్రాఫిక్ సౌత్ వెస్ట్ జోన్ డీసీపీ ధనలక్ష్మీ గోషామహల్ ప్రాంతాల్లో పర్యటించి ట్రాఫిక్ స్పెషల్ డ్రైవ్‌ను ప్రత్యేకంగా పరిశీలించారు. ట్రాఫిక్ ఎస్‌ఐ చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనల అమలుపై స్పెషల్ డ్రైవ్

గోల్కొండ: ప్రమాదాలు జరిగినప్పుడు హెల్మెట్ ద్విచక్ర వాహనదారుల ప్రాణాలను కాపాడుతుందని టోలిచౌకీ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సి.హెచ్.సుధాకర్ అన్నారు. బుధవారం టిప్పుఖాన్ బ్రిడ్జీ, టోలిచౌకీ చౌరస్తా, టూమ్స్ చౌరస్తా తదితర ప్రాంతాల్లో హెల్మెట్ లేకుండా వాహనాలను నడుపుతున్న వారికి అవగాహన కోసం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా టిప్పుఖాన్ బ్రిడ్జి వద్ద ద్విచక్ర వాహనాదారులకు హెల్మెట్ పెట్టుకోవడం ఎంత ఉపయోగకరమో వివరించారు. ద్విచక్ర వాహనాదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఆయన స్పష్టం చేశారు. రాంగ్ రూట్ వాహనం నడపడం వల్ల కూడా ప్రమాదాలు ఎక్కువగా జరుగుతుంటాయన్నారు. ద్విచక్ర వాహనాదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నియమాలను పాటించాలని ఆయన అన్నారు. ప్రధాన కూడళ్లు, చౌరస్తాల వద్ద సీసీ కెమెరాలు ఉన్నాయని ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించే వారు వారి ఫొటోలు కెమెరాలో నిక్షిప్తం అవుతాయన్నారు. సీసీ కెమెరాల ద్వారా తాము చట్టాలు ఉల్లంఘించిన వారికి ఆన్‌లైన్‌లో చలానాలు పంపుతామని ఆయన స్పష్టం చేశారు.

కొనసాగుతున్న అంబేడ్కర్ వర్సిటీ ఉద్యోగుల ఆందోళన


ఆందోళన నిర్వహిస్తున్న అంబేడ్కర్ వర్సిటీ ఉద్యోగులు..

బంజారాహిల్స్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయ పదెకరాల స్థలాన్ని జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ విశ్వవిద్యాలయానికి కేటాయించొద్దని ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేశారు. పదెకరాల స్థలం కేటాయించాలనే ప్రభుత్వ ఆలోచనను నిరసిస్తూ అంబేడ్కర్ వర్సిటీ ఐక్య కార్యాచరణ సమితి సభ్యులు బుధవారం మధ్యాహ్నం భోజన విరామ సమయంలో ఆందోళనను కొనసాగించారు. జేఏసీ చైర్‌పర్సన్ పల్లవీ కాబ్డే, కన్వీనర్ వద్దానం శ్రీనివాస్, సెక్రటరీ జనరల్ వేణుగోపాల్‌రెడ్డిలు మాట్లాడుతూ విశ్వవిద్యాలయం న్యాక్-ఏ గ్రేడ్‌ను సాధించిందన్నారు. యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్, రాష్ట్రీయ ఉచ్చతర్ శిక్షా అభియాన్ నుంచి నిధుల పొందే అవకాశం ఉందన్నారు. విశ్వవిద్యాలయం ఆంగ్ల భాషా అధ్యయనంతో పాటు అంతర్జాతీయ భాషలకు కూడా కోచింగ్ అందించాలని ప్రయత్నం చేపడుతుందని, సంబంధిత కోర్సుల కోసం ప్రత్యేక శిక్షణ కేంద్రాలు, భాషా ప్రయోగశాలలను ప్రత్యేకంగా నిర్మించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఈ ప్రతిపాదిత భవనాల నిర్మాణానికి తగిన యూనివర్సిటీ స్థలం అందుబాటులో లేదన్నారు. విద్యార్థులకు కొత్తగా కంప్యూటర్ ల్యాబ్స్ నిర్మించే అవసరం ఉందన్నారు. ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని, లేఖను తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. విశ్వవిద్యాలయంలో గత కొన్ని రోజులుగా కొనసాగుతున్న ఈ నిరసనను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం తన ఆలోచనా విధానాన్ని మార్చుకోకుంటే ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నేతలు యాకేష్ దైద, కాంతం ప్రేంకుమార్, రవీంద్రనాథ్ సోలమన్, ఎండీ హబీబుద్దీన్, రజనీకాంత్, షబ్బీర్, రాములు, నారాయణరావు, రుషేంద్ర మణి, అవినాష్, కిషోర్, రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.